సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 1 । జనవరి । 2023



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి ఇండ్ల నారాయణ(కావలి) రూ.1,11,116 విరాళంగా శనివారం సమర్పించారు.



ఏడు ప్రదక్షణల హుండీలో విరాళం

ఆత్రేయపురం వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏడు ప్రదక్షణల హుండీలో శనివారం ఉండమట్ల నాగేశ్వరరావు(మూలస్థానం) రూ.55 వేలు సమర్పించినట్లు ఈవో తెలిపారు.

10.25 అడుగులకు నీటిమట్టం



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటిమట్టం శనివారం రాత్రి 10.25 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు శనివారం 9,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు 2,900, సెంట్రల్ 1,900, పశ్చిమ డెల్టాకు 5,050 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

ముగిసిన రైఫిల్ షూటింగ్ పోటీలు



రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో విజేతలు

ప్రకాశం నగర్ : ఆంధ్రప్రదేశ్ స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు శనివారం ముగిశాయి. విజేతలకు రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ టి.కె.విశ్వేశ్వరరెడ్డి బహుమతులు అందజేశారు. అండర్ 19 మహిళా విభాగంలో కావ్య గోల్డ్ (కృష్ణ జిల్లా), షేక్ షమీమా సిల్వర్ (గుంటూరు), కీర్తి నాయుడు బ్రాంజ్ మెడల్ (గుంటూరు) గెలుచుకున్నారు. అండర్-14 బాలికలలో ఎస్.లీలా అన్విత గోల్డ్ (వైజాగ్), లోకజ్ఞ సిల్వర్ (తూర్పు గోదావరి), ఎన్.మహిమా వర్మ బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నారు. పిస్టల్ అండర్-14 బాలురలో టి.చరణ్ జీత్ గోల్డ్ (వైజాగ్), దీపక్ సిల్వర్ (వైజాగ్), షేక్ మహ్మద్ సాదిక్ బ్రాంజ్ మెడల్ (గుంటూరు) గెలుచుకున్నారు. అండర్-19 విభాగం గోపిక గోల్డ్ (కృష్ణ జిల్లా), రిషిత సిల్వర్ (కృష్ణా), షేక్ సల్మా బ్రాంజ్ మెడల్ (కృష్ణా) గెల్చుకున్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగకుమార్, రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ టీవీడీ చంద్రశేఖర్, స్కూల్ డైరెక్టర్లు టి.స్వరూప్ రెడ్డి, సీహెచ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీయత్నం

దేవరపల్లి: దేవరపల్లిలో మూడు రోడ్ల ప్రధాన కూడలిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో దుండగులు చొరబడి నగదు చోరీకి విఫలయత్నం చేశారు. శనివారం తెల్లవారుజామున సంఘటన జరిగి ఉంటుందని బ్యాంకు అధికారులు, పోలీసులు భావిస్తున్నారు. ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసి, పరికరాలను పడేశారు. ఏటీఎంలోని నగదు భద్రంగా ఉందని బ్యాంకు బ్రాంచి మేనేజరు రాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు బ్యాంకుకు వచ్చిన తర్వాత ఏటీఎం మిషన్ ధ్వంసం అయినట్టు గుర్తించినట్టు చెప్పారు. ఏటీఎంలోని నగదును అధికారులు బ్యాంకు తీసుకువెళ్లారు. సీఐ ఏ. శ్రీనివాసరావు, ఎస్సై కె. శ్రీహరి రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

తూర్పున ప్రగతి ఉషోదయం



కడియంలో పల్ల వెంకన్న నర్సరీలో వినూత్నంగా కొత్త సంవత్సరానికి స్వాగతం

- నూతన సంవత్సరానికి ప్రజల స్వాగతం
- 2023లో అభివృద్ధి వైపు మరింతగా అడుగులు
- కొత్త ప్రాజెక్టులు పట్టాలెక్కాలని ఆకాంక్ష

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కొత్త సంవత్సరంలో అంతా మంచే జరగాలని ప్రజలు ఆకాంక్షిస్తుంటారు. గడించిన కాలం మిగిల్చిన తీపి, చేదు అనుభవాలే పునాదిగా.. నూతన సంవత్సరం తమకు మరింత మేలు చేకూరాలని కోరుకుంటారు. గడచిన కొన్నేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు తూర్పు గోదావరి జిల్లా ప్రజలకు నవ జీవనాన్ని అందిస్తున్నాయి. 2022లో జిల్లాల పునర్విభజన తరువాత జిల్లాలో ప్రగతి దిశగా అడుగులు ఎంతో వేగంగా పడుతున్నాయి. ఇంతవరకూ జరిగిన ప్రగతిని గుర్తు చేసుకుంటూ.. విభజన అనంతరం ఏర్పడిన మూడు జిల్లాల్లో కొత్త సంవత్సరంలో సాకారం కానున్న అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. కొత్త సంవత్సరం కూడా మరింత మేలు చేసి, తమ ఆశలను సాకారం చేయాలని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారు. అదే ఆకాంక్షతో నూతన సంవత్సరం- 2023కు స్వాగతం పలికారు.

కొత్త జిల్లాలో కొత్త పుంతలు

- కొత్త సంవత్సరంలో నవ్య తూర్పు గోదావరి జిల్లా ప్రగతి సరికొత్త పుంతలు తొక్కనుంది.
- జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో రూ.470 కోట్లతో 32 ఎకరాల్లో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం ఇప్పటికే చేపట్టారు. యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్న ఈ కళాశాల భవన నిర్మాణాలు కొత్త సంవత్సరంలో పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు. ఈ కాలేజీ ద్వారా 150 మెడికల్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పుడున్న జిల్లా ప్రభుత్వాసుపత్రిలో 430 పడకలు అందుబాటులోకి ఉండగా, మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి కొత్త సంవత్సరంలో ఆవిష్కృతం కానుంది.
- నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకం కింద రాజానగరం మండలం వెలుగుబంద గ్రామం వద్ద 284 ఎకరాల్లో 13,069 మంది పేదలకు పట్టాలు ఇచ్చారు. ఇక్కడ కొత్త సంవత్సరంలో 6,156 మందితో జగనన్న మెగా టౌన్‌షిప్ సాకారమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.
- కాతేరు - సీతానగరం మధ్య 20 కిలోమీటర్ల రోడ్డు దీర్ఘకాలంగా అధ్వానంగా ఉంది. ఈ రహదారిని రూ.70 కోట్లతో నాలుగు లేన్లుగా విస్తరిస్తున్నారు. ఈ పనులను కొత్త సంవత్సరంలో పూర్తి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు.
- రైతుల కష్టాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం రూ.53 కోట్లతో తలపెట్టిన తొర్రిగెడ్డ కాలువ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. దీనిని కొత్త సంవత్సరంలో పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.



వెలుగుబంద వద్ద చురుగ్గా పేదల ఇళ్ల నిర్మాణం

- తొలి సైన్స్ సెంటర్‌ను బొమ్మూరులో రూ.17 కోట్లతో చేపట్టారు. పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇది కొత్త సంవత్సరంలో అందుబాటులోకి వస్తుందని ఎదురు చూస్తున్నారు.
- కోల్‌కతా - చెన్నై జాతీయ రహదారిపై మోరంపూడి సెంటర్ ప్రమాదభరితంగా ఉంది. ఇక్కడ తలపెట్టిన ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు కొత్త సంవత్సరంలో వేగం అందుకునేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.
- గోపాలపురం నియోజకవర్గం ద్వారకా తిరుమల మండలం జి.కొత్తపల్లిలో 100 ఎకరాల విస్తీర్ణంలో తొలి పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు చేస్తున్న సన్నాహాలు కొత్త ఏడాది సాకారం కావాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆకాంక్షిస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలపై ఫోకస్



కొత్త ఏడాదిలో రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. అలాగే మహిళలు, బాలల రక్షణకు ప్రత్యేక దృష్టి సారించనున్నాం. ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోలీసులను మరింత అప్రమత్తం చేస్తాం. అలాగే డ్రగ్స్, గంజాయి వంటి వాటిపైనా ఫోకస్ పెడుతున్నాం. సారాపై ఉక్కుపాదం మోపి తుదముట్టించేలా ఎస్ఈబీ అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. పోలీసులు అందరూ బాగా పనిచేస్తున్నారు. అందరికీ న్యూఇయర్ శుభాకాంక్షలు.

- ఇన్‌చార్జ్ ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి

జగన్‌కు అండగా నిలుద్దాం



కొవ్వూరు: రాష్ట్ర ప్రజలందరికీ, ప్రత్యేకించి నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. కొత్త సంవత్సరంలోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు అండగా నిలవాలని ప్రజలను కోరారు. కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

- రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



నవరత్నాల పథకాలను అర్హులందరికీ అందేలా చూస్తాం. కొత్తగా జిల్లా ఆవిర్భవించాక అధికారులంతా సమన్వయంతో పనిచేశారు. అన్నింటా అనుకున్న లక్ష్యాలు సాధించారు. ఉపాధి హామీ పథకం అమలులో జిల్లా నూరు శాతం కంటే ఎక్కువగా లక్ష్యాలు సాధించాం. జగనన్న సర్వేలో కూడా అనుకున్న మేర ముందంజ వేయగలిగాం. మరింత కృషి చేసి రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడానికి అధికార యంత్రాంగం సహాయంతో పనిచేస్తాం. జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులు, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

- కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్

సంపూర్ణ అక్షరాస్యతతోనే సమగ్రాభివృద్ధి



ట్యాబ్‌ల పంపిణీలో ఎంపీలు భరత్‌రామ్, బోస్, రుడా చైర్‌పర్సన్ షర్మిళారెడ్డి తదితరులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాష్ట్ర సమగ్రాభివృద్ధి సంపూర్ణ అక్షరాస్యతతోనే సాధ్యమనే ఆశయంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగాన్ని తీర్చిదిద్దుతున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో రాజమండ్రి అర్బన్ పరిధిలో ప్రభుత్వ స్కూళ్లకు చెందిన 8వ తరగతి విద్యార్థులకు శనివారం టాబ్స్ పంపిణీ చేశారు. దీనికి ఎంపీ భరత్‌రామ్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్ చంద్రబోస్, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఎంపీలకు సత్కారం

రాజమహేంద్రవరం రూరల్: ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, మార్గాని భరత్‌రామ్‌లను ఆర్యాపురం బ్యాంకు పాలకవర్గ సభ్యులు ఎంపీ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తమను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీలను సత్కరించారు. సత్కరించిన వారిలో పాలకవర్గం చైర్‌పర్సన్ గిరజాల రామ తులసి, డైరెక్టర్లు ఉన్నారు. పాలకవర్గాన్ని రుడా చైర్పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు అభినందించారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ఆదివారం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభవుతుందని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి తెలిపారు. 2,38,868 పెన్షన్‌దారులకు ప్రభుత్వం రూ.65.82 కోట్లను విడుదల చేసిందన్నారు. కొత్తగా అర్హులైన 8,633 మందికి కూడా ఈసారి పింఛన్లు అందుతాయి.

జగన్ వెంటే జనం అని చాటుదాం

- 3న సీఎం సభకు భారీగా తరలిరావాలి
- ప్రజలకు ఎంపీ మార్గాని భరత్‌రామ్ పిలుపు



మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో రాజ్యసభ సభ్యుడు బోస్



సమావేశంలో పాల్గొన్న మంత్రి వేణు, కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏదైనా మంచి కార్యక్రమం తలపెడితే మన జిల్లా నుంచే దానిని ప్రారంభిస్తారని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ పేర్కొన్నారు. ఈ సెంటిమెంట్‌తోనే ఆయన 3న రాజమహేంద్రవరం వస్తున్నారన్నారు. శనివారం స్థానిక వీఎల్‌పురంలోని తన కార్యాలయంలో ఎంపీ మీడియా సమావేశంలో మాట్లాడారు. కొత్త సంవత్సరంలో తొలిసారిగా వస్తున్న సీఎంకు జిల్లా పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రజలు వేలాదిగా తరలి వచ్చి మద్దతు పలకాలన్నారు. పార్టీ రహితంగా పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న జన బాంధవుడికి 'నీ వెంటే మేమంతా' అని చెప్పాలన్నారు.

ప్రాణాలతో నీచ రాజకీయాలా?

చంద్రబాబు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 14 సంవత్సరాలపాటు సీఎం చేసిన నాయకుడు మీడియా పబ్లిసిటీ కోసం ప్రజల ప్రాణాలు తీసేస్తారా అంటూ చంద్రబాబును ఉద్దేశించి విమర్శించారు. కందుకూరు తొక్కిసలాటలో ఏకంగా 8 మంది ప్రాణాలు పోతే మానవత్వం లేకుండా వ్యవహరించారంటూ మండిపడ్డారు. గోదావరి పుష్కరాల ప్రారంభంలో వీడియో షూట్, లఘు చిత్రం అంటూ సినీ దర్శకులు, డ్రోన్ కెమెరాలతో పెద్ద హడావిడి చేసి ఒక్కసారిగా గేట్లు ఎత్తేయడంతో సుమారు 29 మంది మృత్యువాతపడిన సంగతి జనం మర్చిపోలేదన్నారు. ఇంకా ఎంతమందిని ఇలాంటి వైఖరితో పొట్టనబెట్టుకుంటారని భరత్ ప్రశ్నించారు. కందుకూరు దుర్ఘటనపై ఆయన దత్తపుత్రుడు, ప్యాకేజీ స్టార్ నోరెందుకు మెదపడం లేదని ప్రశ్నించారు.

ప్రత్యేక హోదా ప్రకటించాలి

కరోనా మహమ్మారి కారణంగా రెండేళ్ల పాటు ప్రజలు అల్లాడిపోయారని ఎంపీ చెప్పారు. 2022లో మాత్రం కొంచెం సేదతీరారన్నారు. కొత్త సంవత్సరం ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం పెద్ద మనసు చేసుకుని మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థికపరమైన అంశాలకు పరిష్కారం చూపాలని కేంద్రాన్ని ఎంపీ కోరారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్ చంద్రబోస్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాష్ట్ర తెలికులగాండ్ల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిన భవానీప్రియ, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఆర్యాపురం అర్బన్‌బ్యాంక్ చైర్‌పర్సన్ గిరిజాల రామకృష్ణ తులసి, పార్టీనాయకులు తదితరులు ఉన్నారు.

పర్యటన ఏర్పాట్లను సమీక్షించిన మంత్రి వేణు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 3న రాజమహేంద్రవరం రానున్న సందర్భంగా స్వాగత ఏర్పాట్లు ఘనంగా చేయాలని జిల్లా ఇంఛార్జి మంత్రి చెల్లు బోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ చెప్పారు. శనివారం రాత్రి కలెక్టరేట్ కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్‌లతో ఆయన సమావేశమయ్యారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతిష్టాత్మక వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు ప్రజల సమక్షాన నిర్వహిస్తున్నారని మంత్రి తెలిపారు. అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ మంత్రి వేణు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

3న సీఎం పర్యటన ఇలాగా...

- మంగళవారం ఉదయం 11 గంటలకు రాజమహేంద్రవరం మున్సిపల్ స్టేడియంలోని హెలిప్యాడ్‌కు సీఎం చేరుకుంటారు.
- 11.20 గంటలకు ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని సభా వేదికకు వస్తారు.
- మధ్యాహ్నం 1.10గంటల వరకు వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపుదల, స్టాల్స్ సందర్శన, లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు.
- 1.20 గంటలకు తిరిగి హెలిప్యాడ్ చేరుకుంటారు.
- 1.40 గంటలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి బయలుదేరతారు.

క్లుప్తంగా

సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ ఖోఖోపై సమీక్ష

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే ఇండోర్ స్టేడియంలో జనవరి 9 నుంచి 12వ తేదీ వరకూ నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో మెన్ టోర్నమెంట్‌పై వర్సిటీ సమావేశ హాలులో ఉప కులపతి జీవీఆర్ ప్రసాదరాజు శనివారం సమీక్ష నిర్వహించారు. పోటీల నిర్వహణ, క్రీడాకారులకు వసతులు తదితర అంశాలపై కమిటీ నియమించి, సక్రమంగా నిర్వహించేలా చూడాలని ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్యామ్‌కుమార్‌ను ఆదేశించారు. టోర్నమెంట్ కమిటీకి వీసీ ప్రసాదరాజు చైర్మన్‌గా, రెక్టార్ రమణ వైస్ చైర్మన్‌గా, రిజిస్ట్రార్ సుమలత కోశాధికారిగా, డీఏఏ సీహెచ్ సాయిబాబు కన్వీనర్‌గా వ్యవహరిస్తారని వీసీ తెలిపారు.

ఉపాధ్యాయుని అసభ్య ప్రవర్తనపై విచారణ

సామర్లకోట: జి.మేడపాడు జెడ్పీ హైస్కూల్ సోషల్ టీచర్ ఎస్.వెంకట రమణ ప్రవర్తనపై వచ్చిన ఆరోపణలపై జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జే డేనియల్‌రాజు, బాలికల అభివృద్ధి అధికారి క్షేమాబాయి శనివారం విచారణ చేపట్టారు. గ్రామంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శుక్రవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో ఆ హైస్కూల్‌లో చదువుతున్న ఒక బాలిక తల్లి ఆ టీచరు ప్రవర్తనపై ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దవులూరి దొరబాబు ఆదేశాల మేరకు అధికారులు వెంటనే స్పందించారు. పాఠశాలకు వచ్చి విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి లిఖితపూర్వకంగా సమాచారం సేకరించారు. అలాగే సామర్లకోట సీఐ కె.దుర్గాప్రసాద్ కూడా సోషల్ టీచర్ ప్రవర్తనపై సమాచారం సేకరించారు.

ఆ సొమ్ము ఎవరిదో?

- ఏటీఎంలో లభించిన రూ.10 వేలు మేనేజర్‌కు అందజేత
- బ్యాంకు ఖాతాదారు నిజాయితీ



ఏటీఎంలో లభించిన నగదును బ్యాంకు అధికారులకు అందజేస్తున్న నాగేశ్వరరావు

సామర్లకోట: ఒక బ్యాంకు ఖాతాదారు తన నిజాయితీని చాటుకున్న సంఘటన ఇది. స్థానిక రథం సెంటర్‌లోని స్టేట్ బ్యాంకు ఏటీఎంలో నగదు తీయడానికి ఖాతాదారు వైట్ల నాగేశ్వరరావు శనివారం వెళ్లారు. ఆ సమయంలో ఏటీఎం నుంచి రూ.10 వేలు వచ్చి ఉన్నట్టు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ చల్లపల్లి రాజబాబుకు తెలియజేసి, ఆ మొత్తాన్ని అందజేశారు. ఆ రూ.10 వేలు క్యాషియర్ వద్ద ఉన్నాయని చీఫ్ మేనేజర్ రాజబాబు తెలిపారు. సొమ్మును ఏటీఎంలో వదిలేసిన వారు తగిన ఆధారాలతో బ్యాంకు పని వేళల్లో రావాలని చెప్పారు. ఈ ఘటనపై ఏటీఎంలోని సీసీ కెమెరాను కూడా పరిశీలిస్తామని తెలిపారు.

5 శతాబ్దాల క్యాలెండర్



500 సంవత్సరాల క్యాలెండర్‌ను చూపిస్తున్న రిటైర్డ్ టీచర్ శ్రీరాములు

రామచంద్రపురం రూరల్: కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని విశ్రాంత ఉపాధ్యాయుడు 500 సంవత్సరాలకు కలిపి ఒకే క్యాలెండర్ తయారు చేశాడు. రామచంద్రపురంలో నివసిస్తున్న రాయుడు శ్రీరాములు 2005లో కపిలేశ్వరపురం మండలం వాకతిప్పలో ప్రధానోపాధ్యాయుడిగా రిటైరయ్యారు. 1901 నుంచి 2,400 వరకూ సంవత్సరాలకు వృత్తాకారంలో ఆయన ఈ క్యాలెండర్ రూపొందించారు. దీని ఆధారంగా ప్రస్తుతంతో పాటు భవిష్యత్ సంవత్సరాల్లో ఏ తేదీ ఏ వారం వస్తుందో ఈ క్యాలెండర్ ఆధారంగా చెప్పవచ్చన్నారు.

ముక్కోటి కాంతులు

- ముస్తాబైన ఆలయాలు
- రేపు ఉదయం 5 నుంచి ఉత్తర ద్వార దర్శనాలు
- ద్వారకా తిరుమలలో నేడు గిరి ప్రదక్షిణ

ద్వారకా తిరుమల: ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పర్వదినానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల్లో భక్తులకు సోమవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనాలు కల్పించనున్నారు. శ్రీవారి గిరి ప్రదక్షిణ, ముక్కోటి ఏకాదశి వేడుకలకు ద్వారకా తిరుమల దివ్యక్షేత్రం సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ఆలయ పరిసరాలు, రాజగోపురాలు విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి గిరి ప్రదక్షిణ అట్టహాసంగా జరగనుంది. శ్రీవారి పాదుకా మండపం వద్ద మధ్యాహ్నం 2.30 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభం కానుంది. అలాగే ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి భక్తులకు శ్రీవారి ఉత్తర ద్వార దర్శన భాగ్యం కలగనుంది. ఉచిత దర్శనం, రూ.100, రూ.200 టికెట్ల ద్వారా వెళ్లే వారు.. పార్కింగ్ ప్రదేశంలోని జంట గోపురాల ప్రాంతంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్ల గుండా వెళ్లాలి. వీరు ఉత్తర రాజగోపురం మీదుగా ఆలయంలోకి ప్రవేశిస్తారు. రూ.300 టికెట్ల వారు వీఐపీ లాంజ్ పక్కన ఏర్పాటు చేసిన క్యూలైన్ గుండా వెళ్లాలి. వీరు దక్షిణ రాజగోపురం మీదుగా ఆలయంలోకి ప్రవేశిస్తారు. వీఐపీలు, వీవీఐపీలు పడమర రాజగోపుర ప్రాంతంలోని పాత కేశఖండన శాల వద్ద నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్ గుండా ఆలయంలోకి వెళ్తారు. ఆలయంలోని భక్తులు తూర్పు రాజగోపురం మీదుగా బయటకు వెళ్తారు. దర్శనం టికెట్లను క్యూలైన్లలోనే విక్రయిస్తారు. ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్లలో ప్రతి 50 మీటర్లకు ఒక అత్యవసర మార్గం ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వీటిని వినియోగించాల్సి ఉంటుంది. ఆలయ అనివేటి మండపంలో ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.

రేపు శ్రీవారి నిజరూప దర్శనం

ముక్కోటి ఏకాదశి ముందు రోజు సాయంత్రం నుంచి స్వామివారు నిజరూపంలో భక్తులకు దర్శనమివ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం నుంచి భక్తులకు శ్రీవారు నిజరూప దర్శనమివ్వనున్నారు. గిరి ప్రదక్షిణ పూర్తయిన అనంతరం భక్తులందరికీ ఈ దర్శన భాగ్యం కల్పిస్తామని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.



ద్వారకా తిరుమలలో విద్యుద్దీప కాంతులీనుతున్న శ్రీవారి ఆలయ రాజగోపురాలు

రత్నగిరిపై చురుకుగా ఏర్పాట్లు

అన్నవరం: సత్యదేవుడిని ఉత్తర ద్వారం గుండా భక్తులు దర్శించేందుకు ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేస్తున్నారు. సత్యదేవుడిని పాలకడలిలో శేషశయ్యపై పవళించే శ్రీమహావిష్ణువుగా, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకరిస్తారు. స్వామి, అమ్మవార్ల వేదికను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఆ రోజు తెల్లవారుజామున 4 గంటలకు స్వామివారికి పంచహారతులు సమర్పిస్తారు. తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మాత్రమే ఉత్తర ద్వార దర్శనం కల్పించాలని నిర్ణయించగా.. దీనిని సాయంత్రం 5 గంటల వరకూ పెంచారు. ఉదయం 11 గంటలకు స్వామి, అమ్మవార్లను వెండి రథంపై ప్రాకారంలో ఊరేగిస్తారు. రాత్రి 7 నుంచి వెండి గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లను గ్రామంలో ఊరేగిస్తారు. ముక్కోటి వేడుకలకు విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సత్యనారాయణమూర్తి శనివారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేవస్థానానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను వివరించారు. ఉత్తర ద్వార దర్శనానికి విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి వస్తారని అధికారులు తెలిపారు. కాగా, ముక్కోటి ఏకాదశి నాడు వీఐపీల ఉత్తర ద్వార దర్శన సమయంలో కూడా సామాన్య భక్తులకు యథావిధిగా దర్శనం కల్పించాలని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశించారు. భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేయాలని, ప్రసాదం, అన్నపానీయాలకు లోటు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

'నన్నయ'లో వుమెన్ సెల్ ఏర్పాటు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వుమెన్ సెల్‌ను ఉప కులపతి ఆచార్య ఎం.జగన్నాథరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్సిటీలో చదువుతున్న వారిలో అమ్మాయిలే ఎక్కువన్నారు. అందుకనే వారి భద్రతను దృష్టిలో పెట్టుకుని వుమెన్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. అమ్మాయిలు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నా వెంటనే ఈ సెల్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వుమెన్ సెల్‌కు కో ఆర్డినేటర్‌గా డాక్టర్ కె.సూకరత్నం వ్యవహరిస్తారని చెప్పారు.

ఆర్‌ఓ ప్లాంట్లు ప్రారంభం

యూనివర్సిటీ ప్రాంగణంలో కొత్తగా ఏర్పాటు చేసిన రెండు ఆర్‌ఓ ప్లాంట్లను కూడా వీసీ ఆచార్య జగన్నాథరావు లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులకు తాగునీటిని అందించేందుకు వర్సిటీ ప్రాంగణంలోని సెంట్రల్ లైబ్రరీ వద్ద ఒకటి, కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని సివిల్, మెకానికల్ భవనంలో ఒకటి చొప్పున ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓఎస్‌డీ ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.రమణేశ్వరి, డాక్టర్ పి.ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



వుమెన్ సెల్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య జగన్నాథరావు

పేదల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాలి

- జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు
- అవిభక్త 'తూర్పు' ఎంపీడీఓలతో సమీక్ష

కాకినాడ సిటీ: పేదల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేయాలని అధికారులను జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆదేశించారు. పాలనా పరమైన అంశాలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవిభక్త తూర్పు గోదావరి జిల్లాలోని 62 మంది ఎంపీడీఓలు, పరిపాలనాధికారులతో శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉద్యోగులందరూ ప్రభుత్వంలో భాగమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాలు, పింఛన్ల పంపిణీ, రేషన్ కార్డుల మంజూరు వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. జెడ్పీ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఎ.రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

వెంకన్న ఆలయంలో ముక్కోటి ఏర్పాట్లు

అమలాపురం టౌన్: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె, ధర్మకర్తలు మాట్లాడారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. సోమవారం తెల్లవారుజాము నుంచి స్వామి దర్శనం ఉంటుందన్నారు. ఈఓ దూనబోయిన సాయిబాబు, పట్టణ వైఎస్సార్ సీపీ యువజన అధ్యక్షుడు దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉత్తర ద్వార దర్శనం

సఖినేటిపల్లి: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్టు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 6.30 గంటల నుంచి ఉత్తర ద్వారం గుండా లక్ష్మీనరసింహస్వామి దర్శనాలకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

కొబ్బరి రైతు, డ్రైవర్‌పై లారీ యూనియన్ సభ్యుల దాడి

- 20 మందిపై కేసు
- పోలీసుల అదుపులో ఏడుగురు

మామిడికుదురు: కొబ్బరి లోడింగ్, అన్‌లోడింగ్ విషయంలో ఏర్పడిన వివాదం చినికి చినికి గాలివానగా మారింది. కొబ్బరి రైతులు, లారీ యూనియన్ ప్రతినిధుల మధ్య ఏర్పడిన ఈ వివాదం ఏర్పడింది. పాశర్లపూడి బాడవలో లారీ యూనియన్ ప్రతినిధులు తమపై దాడి చేశారంటూ గెద్దాడకు చెందిన రైతు, లారీ యజమాని నేదూరి సుబ్రహ్మణ్యం, విజయవాడ కృష్ణలంకకు చెందిన లారీ డ్రైవర్ కొమ్మే రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా పోలీసులు 20 మంది లారీ యూనియన్ ప్రతినిధులపై శనివారం కేసు నమోదు చేశారు. నగరం ఎస్సై ఎస్‌కే జానీ బాషా కథనం ప్రకారం.. ఉభయ గోదావరి జిల్లాల లారీ యూనియన్ కొన్ని రోజులుగా సమ్మె చేస్తోంది. పండగ సీజన్ కావడంతో యూనియన్‌లో సభ్యత్వం లేని లారీలను విజయవాడ నుంచి తీసుకువచ్చారు. వాటిలోకి కూలీలు కొబ్బరి కాయలు ఎగుమతి చేస్తున్నారు. ఇంతలో సమ్మె చేస్తున్న లారీ యూనియన్ ప్రతినిధులు అక్కడకు చేరుకుని లోడింగ్‌ను అడ్డుకున్నారు. తాము యూనియన్‌లో సభ్యులం కాదని, సమ్మెతో తమకు సంబంధం లేదని నేదూరి సుబ్రహ్మణ్యం, డ్రైవర్ కొమ్మే రమేష్ చెప్పారు. దీంతో యూనియన్ ప్రతినిధులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇక్కడ లోడు పూర్తయిన అనంతరం సుబ్రహ్మణ్యం, రమేష్‌లు లారీని పాశర్లపూడి బాడవకు తీసుకువెళ్లారు. అదే సమయంలో మరి కొంత మందిని వెంట పెట్టుకుని లారీ యూనియన్ ప్రతినిధులు అక్కడకు చేరుకున్నారు. లారీని నిలుపు చేసేందుకు ప్రయత్నించారు. డ్రైవర్ రమేష్ లారీని ముందుకు తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. అతడిని డ్రైవర్ సీటు నుంచి బయటకు లాగి, దాడి చేశారు. రైతు, లారీ యజమాని సుబ్రహ్మణ్యంపై కూడా దాడికి దిగారు. లారీ టైర్లలో గాలి తీసేసి, వాల్‌నెక్‌లు ధ్వంసం చేశారు. సమాచారం తెలిసిన పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గాయపడిన బాధితులను రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, లారీ యూనియన్‌కు చెందిన ఏడుగురిని అదుపులోకి తీసుకుని కేసు విచారణ చేపట్టామని ఎస్సై చెప్పారు.

సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలుకుదాం











రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పెంపులో భాగంగా ఈ నెల మూడో తేదీన రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలో జరిగే బహిరంగ సభకు విచ్చేయనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలుకుదామని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ చైర్మన్ మజ్జి అప్పారావు పిలుపునిచ్చారు. శనివారం 31వ డివిజన్ మధన్‌సింగ్‌పేటలో డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ మజ్జి నూకరత్నం ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నగరంలో అజాద్‌చౌక్ మీదుగా సీఎం పర్యటను సాగుతుందని, ఆయనకు ఘనంగా స్వాగతం పలకాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు లంక సత్యనారాయణ, నల్లా రామాంజనేయులు, శ్రీను, షైక్ బాబ్జి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు











చాంబర్ ఆఫ్ కామర్స్ వితరణ

కంబాలచెరువు: నగరానికి చెందిన వర్తకుల స్వచ్ఛంద సేవా సంస్థ చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ లాలాచెరువు ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం దాదాపు రూ.48 వేలు విలువ గల 10 కుర్చీలు, 10 టేబుల్స్‌ను శనివారం వితరణ చేశారు. పాఠశాల విద్యకు సహాయం అందించడంలో తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందని ట్రస్ట్ ఉపాధ్యక్షుడు ముద్దుల మురళీకృష్ణ తెలిపారు. కుర్చీలు, టేబుల్స్‌ను ప్రధానోపాధ్యాయులు ఎ.మల్లేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి దేవత సుధాకర్, ట్రస్ట్ డైరెక్టర్ లక్కోజు వీరభద్ర రావు, సభ్యులు సీతారామాంజనేయులు, ఉపాధ్యాయులు బి.రాజేంధర్, సరితా రంజని, బి.నాగేశ్వరరావు, విజయకుమారి ఎస్.రవి కిశోర్ పాల్గొన్నారు.




















సాక్షి ఫ్యామిలీ
రాజమహేంద్రవరం
ఆదివారం ॥ 1-1-2023

2023 - ఆకాంక్షలు



ప్రతి కుటుంబం వర్ధిల్లు గాక!

కాలం చల్లటి నీడనిచ్చే చెట్టు కావాలి. వడగాడ్పు నుంచి, ఊపి కొట్టే వాన నుంచి, గడ్డ కట్టే చలి నుంచి అది మనుషులను కాయాలి. పంటలు సమృద్ధిగా పండాలి. తియ్యటి మామిడిపండ్లు బండ్ల కొద్దీ మండీలకు చేరాలి. పూలు సలీసుగా దొరకాలి. కొలనుల్లో చేపల వీపులను తామరతూడులు తడమాలి. నదులు ఒండ్రుమట్టిని ఒడ్డుకు తోస్తూ ప్రవహించాలి. సముద్రాలు శాంత వచనాలు పలకాలి. మహమ్మారులు తోకలు ముడవాలి. ఒకటీ అరా మాత్రలతో తగ్గిపోయే రోగాలే చలామణిలో ఉండాలి. నాలుగు గోడలు లేపినవాడు పైకప్పు వేసుకోగలగాలి. గూడే లేని వాడు ఇంత జాగా సంపాదించుకోవాలి. ఉద్యోగాలు ఇబ్బడి ముబ్బడిగా చేతికందాలి. కాయకష్టం చేసేవాడు బువ్వకు లోటెరగక ఉండాలి. పాలకులు పెద్ద మనసు చేసుకోవాలి. కట్నాలు, లాంఛనాల జంజాటాలు లేక అప్పుల బెంగ ఎరగని పెళ్లిళ్లు జరగాలి. ఆడపిల్లలు సగౌరవంగా, సురక్షితంగా ఉండాలి. స్త్రీల గెలుపు గాథలు వినిపించాలి. యువతీ యువకుల సబబైన ఇష్టాలు చెల్లుబాటు కావాలి. రహదారులు క్షేమమార్గాలుగా విలసిల్లాలి. సమాజం శాంతితో నిండాలి. అశాంతి కొరకు ప్రయత్నించే ప్రతి చర్యా చతికిలపడాలి. హేతువుకు చోటు దక్కాలి.

ప్రతి ఇల్లు పాలు తేనెల సమృద్ధితో నిండాలి. తాతయ్య, నానమ్మలు కులాసాగా ఉండాలి. అమ్మ చెప్పినట్టు అందరూ వినాలి. నాన్న జేబు ఎప్పుడూ నిండుగా ఉండాలి. పిల్లలు సదా పకపకలాడాలి. చదువులెన్నో బుద్ధిగా చదవాలి. బంధువులందరూ బలగంగా ఉండాలి. స్నేహితులందరూ శక్తిగా మారాలి. కొత్త సంవత్సరం అందరికీ శుభాలు తేవాలి. ప్రతి కుటుంబం వర్ధిల్లాలి.

మంచిని తలుద్దాం. విశ్వం వింటుంది.
గట్టిగా అనుకుందాం. తప్పక నెరవేరుతుంది.
హ్యాపీ న్యూ ఇయర్.







* ఎంపిక

న్యూఇయర్ గిఫ్ట్

న్యూ ఇయర్ సందర్భంగా ఆత్మీయులకు కానుకలు ఇచ్చి ఆనందాన్ని పంచుకోవాలనుకుంటారు. అందుకు ఖరీదైన కానుకలనే ఎంచుకోనక్కర్లేదు. మీరిచ్చే బహుమతి ఆశ్చర్యాన్ని కలిగించనక్కర్లేదు. సానుకూలమైన ఆలోచనలు కలిగించేవిగా ఉంటే చాలు. కొన్ని నెలల తర్వాత చెత్త బుట్టలో పడేసే వాటిని ఇచ్చే బదులు తక్కువ ఖర్చుతో పర్యావరణ స్నేహపూర్వక కానుకలను ఇస్తే అన్ని చోట్లా ఆనందం రెట్టింపు అవుతుంది.

పెయింట్ వేసిన కుండీలు

ఇండోర్ లేదా అవుట్ డోర్‌లలో అందమైన పెయింట్ చేసిన మొక్కల కుండీలను కూడా అలంకరణకు వాడుతుంటారు. స్వయంగా పెయింట్ చేసిన కుండీలను కూడా కానుకకు ఎంపిక చేసుకోవచ్చు.



క్లే బాటిల్.. ఉడెన్ స్పూన్

పర్యావరణ హితమైన వాటిలో నిత్యం ఉపయోగపడేవి ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. వాటిలో స్టోరేజీ బాస్కెట్, క్లే బాటిల్స్, ఉడెన్ స్పూన్స్, టెర్రకోట షోకేస్ లేదా కిచెన్ ఐటమ్స్, జూట్ బ్యాగ్స్.. ఇతర యాక్సెసరీస్ ఎంపిక చేసుకోవచ్చు.






పచ్చని కానుక

మొక్కలను ప్రేమించనివారుండరు. అవి ఇండోర్ లేదా అవుట్ డోర్ కావచ్చు. గృహాలంకరణలోనూ మొక్కలకు కొంత ప్లేస్‌ను కేటాయిస్తుంటారు. ఇలాంటి అభిరుచి గలవారికి చిన్న చిన్న మొక్కలు ఉన్న కుండీలను కానుకగా ఇవ్వచ్చు. విత్తన ప్యాకెట్లను ఎంపిక చేసి ఇవ్వచ్చు. స్థానికంగా ఉన్న నర్సరీలో మొక్కల కొనుగోలుకు కొంత మొత్తం చెల్లించి, ఆ రసీదును కానుకగా ఇవ్వచ్చు. ఆ రసీదుతో వారే తమకు కావల్సిన మొక్కలను ఎంచుకుంటారు.





రీ సైకింగ్..

ఫాస్ట్ ఫ్యాషన్‌లో కొట్టుకుపోతున్న ఈ రోజుల్లో మనవైన సంప్రదాయ హస్తకళలతో రూపుదిద్దుకున్న అలంకార వస్తువులను కానుకగా ఇవ్వచ్చు. వాటిలో ఫ్యాబ్రిక్, థ్రెడ్, ఉడెన్, టెర్రకోట జ్యువెలరీ, ఎంబ్రాయిడరీ చేసిన స్కార్ఫ్స్.. వంటివి ఎంచుకోవచ్చు. **ఇలాంటి ప్రత్యేకమైన కానుకలు సందర్భానికి తగిన విధంగా ఇస్తే ఆత్మీయులను మరింత చేరువ చేస్తాయి.**

బ్యూటిప్స్

బాదం గింజల్లో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మానికి పోషణను అందిస్తుంది. అలాగే నిర్జీవంగా మారిన చర్మకణాలకు జీవం పోస్తుంది. పాలు చర్మాన్ని మాయిశ్చరైజ్ చేస్తాయి.

ఐదు నుంచి ఆరు బాదం గింజలను తీసుకొని వాటిని నానబెట్టాలి. బాగా నానిన తర్వాత వాటి తొక్క తీసి గింజలను పేస్ట్‌లా తయారు చేయాలి. ఆపై కొద్దిగా పాలు కలిపి ముఖానికి, మెడకు రాసి పావుగంట ఆరనివ్వాలి. ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ ఫేస్ ప్యాక్ చర్మానికి ఇన్‌స్టంట్ బ్రైట్ నెస్ అందించడం మాత్రమే కాకుండా చర్మాన్ని అందంగా, మృదువుగానూ మారుస్తుంది. కాబట్టి దీనిని రెగ్యులర్ ఫేస్ ప్యాక్స్ మాదిరిగానూ ఉపయోగించవచ్చు.



ముగ్గు ముచ్చట



21 చుక్కలు : 21 వరసలు



మద్దల పద్మావతి
పెందోటవారి వీధి, తెనాలి



సరస్వతి
తాండూరు

18 చుక్కలు : 18 వరసలు



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com
* అడ్రస్‌లో మీ ఊరి పేరుతోపాటు మీ కాలనీ పేరు కూడా రాయండి.

సంవత్సర ఫలాలు



2023. ఈ సంవత్సరం అంకెలు మొత్తం కూడితే 2+0+2+3=7, వస్తుంది. 7 అంటే కేతుగ్రహానికి సంకేతం. దీని ప్రభావం వలన వైద్యం, ఆరోగ్యం, ఆధ్యాత్మికత, పురాతన గ్రంథాలు, మరుగున పడిన తాంత్రిక విద్యలు, ఆయుర్వేదం, జ్యోతిషం వంటి విద్యలలో సృజనాత్మక మార్పులు, అభివృద్ధి జరుగుతాయి. వైద్య విద్య, వైద్య పరిశోధనలపై ప్రజలకు, ప్రభుత్వానికి ఎక్కువ ఆసక్తి కలుగుతుంది. ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ రంగంపై విద్యార్థులలో ఆసక్తి ఎక్కువ అవుతుంది. స్టాక్ మార్కెట్‌పై కూడా ఆసక్తి పెరుగుతుంది. స్టాక్ మార్కెట్ ఫిబ్రవరి వరకు అస్తవ్యస్తంగా ఉంటుంది. ఫిబ్రవరి 2023 తరువాత లాభదాయకంగా ఉంటుంది.

ఈ 2023 సంవత్సరం మొత్తం అంకెలు కలపగా 7 వస్తుంది. కాబట్టి ఈ సంవత్సరం మొత్తం కేతు ప్రభావం కూడా ఎక్కువగా ఉంటుంది. అదే విధంగా జ్యోతిషపరంగా చూసినా 2023 సంవత్సరం ఆదివారం, అశ్విని నక్షత్రం (01-01-2023)తో ప్రారంభం అయ్యి, ఆదివారం, మఖ నక్షత్రం (31-12-2023)తో ముగుస్తుంది. ఈ విధంగా ఈ సంవత్సరం కేతు నక్షత్రం (అశ్విని)తో మొదయ్యి, కేతు నక్షత్రం (మఖ)తో ముగుస్తుంది. అందువలన కేతు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ఈ 2023 శోభకృత్ నామ సంవత్సరంలో ఆధ్యాత్మికత పెరుగుతుంది. కష్టాల నుండి విముక్తి కలిగి ఆత్మజ్ఞానం, తాత్విక జ్ఞానం, ఆత్మాభిమానం కలిగి మంచి పాజిటివ్ ఆలోచనలు కలిగి ప్రజలు అభివృద్ధి పథం వైపు అడుగులు వేస్తారు.

1, 10, 19, 28 తేదీలలో జన్మించినవారికి 2023 సంవత్సరంలో సూర్య, చంద్ర, కేతు గురు గ్రహాల ప్రభావం ఉంటుంది. గురు ప్రభావం వలన ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. పరిశోధన, మైనింగ్ రాజకీయ రంగాలలో ఉన్న వారికి నూతన అవకాశాలు. బాధ్యతలు పెరుగుతాయి. దీనితోపాటు ఆర్థికవృద్ధి, అదృష్టం కలిసి వస్తాయి. కొత్త పథకాలు, వ్యాపారాల ద్వారా లాభాలు గడిస్తారు. విదేశాలలో విద్య, ఉద్యోగం కోసం ప్రయత్నించే వారికి ఇది మంచి సమయం. సంఘంలో గౌరవం పెరుగుతుంది. అవివాహితులకు వివాహ యోగం. వైవాహిక జీవితంలో ఉన్నవారికి స్పర్థలు, అపోహలు తొలగి మంచి వైవాహిక జీవితం గడుపుతారు. భార్య/భర్త ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. నైతికత, విలువలు పాటించాలి. లేకపోతే సన్నిహితులు మిత్రులు దూరం అయ్యే అవకాశం ఉంది. అహం భావం విడిచిపెట్టి గొప్పవారి సాయం తీసుకుంటే లాభదాయకంగా ఉంటుంది. గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరంలో సామాజికంగా పేరు ప్రఖ్యాతులు వస్తాయి. కోర్టు కేసుల్లో అనుకూలమైన తీర్పులు వస్తాయి.

ఆరోగ్యం మెరుగుపడుతుంది. మంచి ఆలోచనలు కలిగి మీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగప్రాప్తి, విద్యలో పూర్తి చేయని కోర్స్‌లు ఉంటే అవి పూర్తి చేస్తారు. డిగ్రీ చేతికి వస్తుంది.

పరిశోధనా రంగం వైద్య రంగం జ్యోతిషం తాంత్రిక విద్యలు మొదలైన రంగాలలో ఉన్నవారికి 2023 సంవత్సరం చాలా మంచి సంవత్సరం. అధిక ఒత్తిడి తీసుకోకుండా శాంతంగా ఉంటూ అహంభావాన్ని విడిచి పెట్టి ప్రయత్నిస్తే ఈ సంవత్సరం మీ జీవితంలో నూతన అధ్యాయానికి నాంది అని చెప్పవచ్చు. దుర్గా సప్తసతి పారాయణ వలన మంచి ఫలితాలు పొందుతారు.

2, 11, 20, 29 తేదీలలో పుట్టినవారికి న్యూమరాలజీ ప్రకారం 2,7 చంద్రునికి సంబంధించిన అంకెలు. ఈ సంవత్సరంలో వీరికి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అవివాహితులకు వివాహయోగం. సృజనాత్మకత పెరుగుతుంది. రచయితలకు,నటులకు, కళాకారులకు ఇది మంచి సమయం. నటులకు, కళాకారుకి మంచి అవకాశాలు దొరికి, చిత్ర రంగంలో మంచి పేరు వచ్చే అవకాశం ఉంది. విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు ఉన్నాయి. ఈ సంవత్సరంలో సమాచార రంగం బాగుంటుంది. ఈ సంవత్సరం 23 సంఖ్య (2+3) కాబట్టి 5 బుధుడి సంఖ్య. దీనివలన స్టాక్ మార్కెట్‌లో అభివృద్ధి ఉంటుంది. సంవత్సర సంఖ్యలోని 3 గురుడుకి సంబంధించి సంఖ్య కావటం వలన పుట్టిన తేదీ (2,11,20,29) చంద్రుడికి సంబంధించినది కావటం వలన చంద్ర గురువుల కలయిక వలన రాజ యోగం కలుగుతుంది. స్నేహితులు, బంధువులతో సత్సంబంధాలు ఏర్పడతాయి. పాత మిత్రులను కలుస్తారు. కార్యాలయంలో గుర్తింపు వస్తుంది. గమ్యాలను చేరుకోగలుగుతారు. చాలా కాలంగా విదేశాలలో ఉన్నవారు స్వదేశం వస్తారు. అప్పు కోసం ప్రయత్నించేవారికి అప్పు దొరుకుతుంది. ఆకర్షణ శక్తి పెరిగి స్నేహితులు ఎక్కువ అవుతారు. గృహోపకరణ, విలాస వస్తువులు కొంటారు. నగదు కోసం ఇబ్బంది పడాల్సి వస్తుంది. అందువలన జాగ్రత్తగా ఖర్చు చెయ్యాలి. హీలింగ్ చేసేవారికి, వక్తలకు ఇది మంచి సమయం. విష్ణు సహస్ర నామం పారాయణం, శ్రవణం చేయటం, రుద్రాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణ వలన మంచి ఫలితాలు వస్తాయి. మీ ఆదాయంలో 2 నుంచి 10 శాతం వికలాంగులకు దానం చేయటం వలన మీ వృత్తిలో ఆదాయ వృద్ధి కలుగుతుంది.

3, 12, 21, 30 తేదీలలో జన్మించినవారికి గురు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీరు నిరంతరం శక్తి సంపన్నులుగా, ఆశావాదులుగా ఉండి తమ ప్రతిభ ద్వారా ఇతరుల కంటే ఎక్కువగా రాణిస్తారు. వీరిపై బుధ, గురు, కేతు ప్రభావం ఉంటుంది. ఈ సంవత్సరంలో ఏ వయసు వారైనా కొత్త పరిజ్ఞానాన్ని పొందుతారు. వృత్తివిద్యలు, నూతన సాంకేతిక విద్యలు నేర్చుకుంటారు. విద్యార్థులకు మంచి సమయం. విదేశీ విద్య కోరిక నెరవేరుతుంది. వీరికి ఈ సంవత్సరం నూతన ఉత్సాహంతో నిర్మాణాత్మకంగా ఉంటుంది. మధ్యలో చదువు ఆపినవారు కొత్త కోర్సులు చేయాలనే కోరిక కలిగి ముందుకు వెళతారు. ఈ సంవత్సరంలో గౌరవ పట్టాలు పొందుతారు. వ్యవసాయదారులకు ఆదాయం పెరుగుతుంది. వేరుసెనగలు, కందులు, పసుపు పండించేవారికి లాభదాయకం. కొత్తకొత్త వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తారు. సంతానం లేనివారికి సంతానం కలుగుతుంది. సంతానం ఉన్నవారి పిల్లలు ఉద్యోగం వచ్చి సెటిల్ అవుతారు. భార్యాభర్తల మధ్య అన్యోన్యత పెరుగుతుంది. షేర్‌మార్కెట్‌లో లాభాలు వస్తాయి. తండ్రికి మంచి సమయం. విదేశీ పర్యటన, పుణ్యక్షేత్రాల దర్శనం జరుగుతాయి. ఈ సంవత్సరంలో తీసుకొనే నిర్ణయాల వలన వచ్చే సంవత్సరంలో లాభాలు వస్తాయి. నైతికంగా ఉండాల్సిన అవసరం ఉంది. మే నుండి పిల్లల విషయంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

దక్షిణామూర్తిని కొలవటం వలన మంచి ఫలితాలు వస్తాయి. ఆదాయంలో 2 నుంచి 10 శాతం పేద విద్యార్థులకు గురువులకు, ఇంటి పురోహితులకు దానం చేయటం వలన మంచి ఫలితాలు వస్తాయి.

4, 13, 22, 31 తేదీలలో జన్మించినవారిపై రాహు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రాహు గ్రహం మీద చాలా మందికి వ్యతిరేకత, అపోహలు ఉంటాయి. కానీ రాహు సంఖ్య 4 చాలా మంచి సంఖ్య. వీరు నిర్మాణాత్మక వైఖరి, వాస్తవిక పంథా, స్థిరత్వం, నైపుణ్యం, ప్రశాంతత శాస్త్రీయమైన బాధ్యతాయుతమైన ఆలోచన, కష్టించే గుణం నిజాయితీ, విశ్వాస పాత్రత, పట్టుదల కలిగి ఉంటారు.

బుధ రాహుల కలయిక వీరిని గొప్ప నిపుణులుగా చేస్తుంది. రాహు అంటే కొత్త సాంకేతిక నైపుణ్యం కలిగి ఉండటం. ఏ వయసులోవారైనా కొత్త టెక్నాలజీ నేర్చుకోవటం, ఆ రంగంలో ఉన్నవారు నూతన ఆవిష్కరణలు చేయటం, దాని వలన పేరు ప్రఖ్యాతులు, సంపద పొందటం జరుగుతుంది. కోర్టు కేసులలో విజయం లభిస్తుంది. వివాహం కానివారికి వివాహం జరుగుతుంది. వివాదాలలో ఉన్న వీరి స్థలం వీరికి లభిస్తుంది. కొత్త ఇల్లు కట్టుకుంటారు. పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులై మంచి ఉద్యోగాలు సంపాదిస్తారు. రెండో పెళ్ళి కోసం ఎదురు చూసేవారికి ద్వితీయ వివాహం జరుగుతుంది. సంవత్సర సంఖ్యలో 3, జన్మ తేదీ రాహు సంఖ్య అవ్వటం వలన గురు ఛండాల యోగం పడుతుంది. కాబట్టి వీరు ఏ నిర్ణయమైనా తీసుకొనే ముందు ఆలోచించి విజ్ఞుల సలహాలు తీసుకొని చేస్తే మంచిది. గురు ఛండాల యోగం ఉన్నందున ప్రేమ వ్యవహారాలు, రిలేషన్ షిప్‌లో ఉండటం మంచిది కాదు. రాజకీయ నాయకులకు పదవులు లభిస్తాయి. ఎంతటి క్లిష్టమైన ఎన్నికలోనైనా గెలుస్తారు.

సర్పదోష నివారణ పూజ, దక్షిణామూర్తి పూజ సుబ్రహ్మణ్య స్వామి పూజ చేయటం వలన మంచి జరుగుతుంది. పేదలకు, అనాథలకు, వికలాంగులకు అన్నదానం చేయడం మంచి ఫలితాన్ని ఇస్తుంది.

5, 14, 23 తేదీలలో జన్మించినవారు బుధ గ్రహ ప్రభావం వల్ల వీరు బహుముఖ ప్రజ్ఞాశాలురుగా ఉంటారు. క్రియాశీలత, సేచ్ఛా ప్రియత్వం, వినోదం, ఉల్లాసం, మంచి, ఆలోచనలు, తెలివి తేటలు, కార్య దక్షత కలిగి ఉంటారు. 2023 సంవత్సరం లో వీరిపై కేతుప్రభావం ఉంటుంది. సంవత్సరం 23(5) కాబట్టి బుధ ప్రభావం ఉంటుంది. వీరి జన్మతేదీ, సంవత్సర సంఖ్య రెండూ 5 కావడం వల్ల బుధ ప్రభావతో వీరి తెలివి తేటలకు, కార్య నిర్వహణకు గుర్తింపు వస్తుంది. పబ్లిక్ రిలేషన్స్, సేల్స్, పర్యాటక రంగం టీవీ, సినిమా పత్రికా రంగాలలో ఉన్నవారైతే మంచి గుర్తింపు వస్తుంది. వ్యవసాయదారులకు కూరగాయలు చెరుకు, పెసలు, మినుములు పండించేవారికి లాభదాయకంగా ఉంటుంది. వీరు కొత్త భూములు, పొలాలు కొనే అవకాశం ఉంది. పెట్టుబడులకు ఇది మంచి సమయం. వ్యాపారస్తులకు లాభాలు వస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వ్యాపార లావాదేవీలలో డాక్యుమెంట్లపై సంతకం చేసేటప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉండాలి. విద్యార్థులకు ఇది మంచి సంవత్సరం. పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఉద్యోగులు వేరే మంచి ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. నోటిని అదుపులో ఉంచుకోకపోతే అవమానాలు జరుగుతాయి. ఆరోగ్యానికి సంబంధించి పంటి, కంటి పరీక్షలు చేయించుకోవాలి.

గణపతి ఆరాధన, రుద్రాభిషేకం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. ఆదాయంలో రెండు నుంచి 10 శాతం దానం చేయటం మంచిది.

6, 15, 24 తేదీలలో జన్మించినవారు శుక్ర గ్రహ ప్రభావం వల్ల వీరికి కళాభిరుచి, సృజనాత్మకత, మానవ సేవ, విశ్వాస పాత్రత వంటి లక్షణాలు ఉంటాయి. త్యాగబుద్ధి, సేవాభావం కలిగి ఉంటారు. శుక్ర, బుధ సంబంధం వలన ఈ సంవత్సరం వైద్యం, జ్యోతిషం, తాంత్రిక సంబంధిత వృత్తుల వారికి చాలా మంచి కాలం. వైద్యులు నూతన వైద్యశాలలు ప్రారంభించే అవకాశం ఉంది. ఏ రంగంలో ఉన్నవారైనా ఆయా రంగాలలో పరిశోధనాత్మక వ్యాసాలు రాస్తారు. అవివాహితులకు వివాహ యోగం. ఈ సంవత్సరంలో వీరు ఎంతో ఆత్మతృప్తిని పొందుతారు. సంవత్సరమంతా చాలా రిలాక్స్‌డ్‌గా ఉంటారు. వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. విదేశాలలో ఉన్నవారు స్వదేశం వచ్చి ఆనందంగా గడుపుతారు. విలాస వస్తువులు కొంటారు. ఊహించని ఆస్తి ప్రాప్తిస్తుంది. నటులు, సంగీతకారులకు, మీడియావారికి, నగల వ్యాపారులకు అనుకూలం. భాగస్వాములతో జాగ్రత్తగా ఉండాలి. రిలేషన్‌షిప్స్‌లో ఉండటం మంచిది కాదు. ప్రేమ వ్యవహారాలలో కూడా జాగ్రత్తగా ఉండాలి.

వీధి కుక్కలకు ఆహారం పెట్టడం, బీదవారికి దుప్పట్లు దానం చేయటం మంచిది. భృగు పాశుపత హోమం లేదా సుదర్శన హోమం చేయించుకోవటం మంచిది.

7, 16, 25 తేదీలలో జన్మించినవారిపై కేతు గ్రహ ప్రభావం ఉంటుంది. వీరికి తాత్విక చింతన, మానవాతీత శక్తులు ఉంటాయి. ఆధ్యాత్మికత మీద దృష్టి ఎక్కువగా ఉంటుంది. ఈ సంవత్సర సంఖ్య కూడా 2023(7) కేతు సంఖ్య. ఎవరికైనా జన్మ తేదీ, సంవత్సర సంఖ్య ఒక్కటిగా ఉన్నప్పుడు , వారిపై ఆ గ్రహ ప్రభావం సంపూర్ణంగా ఉంటుంది. వారు వారి రంగాలలో చక్కగా రాణిస్తారు. మంచి గుర్తింపు వస్తుంది. ఈ తేదీలలో పుట్టినవారు నర్సులు, వైద్యులు, డ్రగ్గిస్టులు, పురోహితులు, జ్యోతిషులుగా ఉంటారు. ఈ రంగాలలో ఉన్నవారికి ఈ సంవత్సరం అత్యంత లాభదాయకం అని చెప్పవచ్చు. విద్య, ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్ళాలనుకొనేవారి కోరిక నెరవేరుతుంది. పుణ్యక్షేత్ర దర్శనం జరుగుతుంది. వీరికి యోగా, ధ్యానం వంటి విషయాలపై మక్కువ ఎక్కువ అవుతుంది. ఈ సంవత్సరం వీరు వ్యాపారంలో రిస్క్ తీసుకోవటం మంచిది కాదు. ప్రేమ వ్యవహారాలలో తల దూర్చకుండా ఉంటే మంచిది. కోర్టులకి, పోలీస్ స్టేషన్స్‌కి వెళ్ళకుండా, సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవటం మంచిది. ఈ సంవత్సరం షేర్ మార్కెట్, స్పెక్యులేషన్‌కు దూరంగా ఉంటే మంచిది. వీరిలో అసాధారణ స్ఫురణ అధికంగా ఉండి ఆధ్యాత్మిక క్రమశిక్షణ పాటిస్తారు. వీరు వీరి రంగాలలో ప్రత్యేకమైన నైపుణ్యం సంపాదించి అందులో ప్రావీణ్యత సాధిస్తారు.

ఆంజనేయస్వామి ఆరాధన, గణపతి ఆరాధన వలన మెరుగైన ఫలితాలు పొందుతారు. దాన ధర్మాల వల్ల ఉపశమనం లభిస్తుంది.

8, 17, 26 తేదీలలో జన్మించినవారిపై శని ప్రభావం ఉంటుంది. ఇతరులకు సహాయ పడటం, అన్యాయాన్ని ఎదిరించడం వీరి లక్షణాలు. వీరిపై ఈ సంవత్సరం కేతు, బుధ, గురు గ్రహాల ప్రభావం ఉంటుంది. శని బుధ గ్రహాలు మిత్ర గ్రహాలు. అదే విధంగా శని, గురు గ్రహాలు కూడా మిత్ర గ్రహాలు. అందువలన వీరికి ఈ సంవత్సరం భౌతిక సంపదలు, అభీష్టసిద్ధి, విజయం ప్రాప్తిస్తాయి. నూతన ఉత్సాహం, శక్తి, మంచి గుర్తింపు, సంపద, కీర్తి లభిస్తాయి. ఇన్సూరెన్స్ నుంచి ధనం రావటం, ఇన్సూరెన్స్ రంగంలో ఉన్నవారికి మంచి ఆదాయం రావటం జరుగుతుంది. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆస్తులు కొంటారు. కోర్టు వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి. గొప్పవారి పరిచయాలు కలుగుతాయి. ఏ రంగంలో ఉన్నవారికైనా ఈ సంవత్సరంలో మంచి ఫలితాలు ఉంటాయి. రాజకీయ నాయకులు చాలా క్లిష్టమైన ఎన్నికలలో కూడా విజయం సాధిస్తారు.

ఈ సంవత్సరంలో వీరిపై శని, కేతు, గురు, బుధ గ్రహాల ప్రభావం ఉండటం వలన వీరు రుద్రాభిషేకం, గణపతి, ఆంజనేయ, దక్షిణామూర్తి ఆరాధన వల్ల సత్ఫలితాలను పొందవచ్చు.

9, 18, 27 తేదీలలో జన్మించినవారిపై కుజ గ్రహ ప్రభావం ఉంటుంది. 2023 సంవత్సర సంఖ్య 7, కేతు సంఖ్య. జ్యోతిష శాస్త్ర ప్రకారం కేతువు, కుజుడు రెండూ ఒకే విధమైన ఫలితాలను ఇస్తాయి. అందువలన ఈ సంవత్సరం వీరికి మంచి సంవత్సరం అని చెప్పవచ్చు. ఈ సంవత్సర సంఖ్యలో ఉన్న 2,0,3 సంఖ్యలు చంద్ర, కేతు,బుధ, గురు గ్రహ ప్రభావాలను కలుగజేస్తాయి. కుజ గురు గ్రహ ప్రభావం వలన గురు మంగళ యోగం కలుగుతుంది. దీని వల్ల రియల్ ఎస్టేట్, మైనింగ్, మిలటరీ, పోలీస్ రంగాలలో ఉన్నవారికి మంచి సంవత్సరం. నిర్మాణం మధ్యలో ఆగిపోయినవి మరల మొదలయ్యి, పూర్తి అయ్యే అవకాశం ఉంది. ఈ సంవత్సరం పెండింగ్ పనులు అన్నీ పూర్తి అయ్యే అవకాశం ఉంది. కొత్త పనులు మొదలు పెట్టడానికి ఇది మంచి సమయం కాదు.

పైకి ధైర్యంగా కనిపించినా, లోలోపల పిరికిగా ఉంటారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి. రిలేషన్‌షిప్స్‌లో ఉన్నవారికి అంత బాగోదు. మనీ మేనేజ్‌మెంట్‌లో జాగ్రత్త అవసరం. అనవసర వాద వివాదాలకు దూరంగా ఉండాలి. హనుమాన్, సుబ్రహ్మణ్య ఆరాధన చేయాలి. అంగారక పాశుపత హోమం చేయించుకుంటే మంచిది. రక్తదానం చేస్తే మంచిది.

గ్రహగతులు, వాటి ప్రభావాన్ని పరిశీలించి చూస్తే, ఈ సంవత్సరంలో అందరూ తగు ప్రయత్నంతో అభివృద్ధి పథంలో పయనిస్తారు. శుభకృత్ నామ సంవత్సరం తరువాత 2023లో వచ్చే శోభకృత్ నామ సంవత్సరం, సార్థక నామధేయంతో అందరికీ కొత్త శోభను తెచ్చి పెడుతుంది.



- మహమ్మద్ దావూద్
ఆస్ట్రో-న్యూమరో-గ్రాఫాలజిస్ట్
హైదరాబాద్.